క్లుప్తంగా

డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులకు సత్కారం


సత్కరిస్తున్న ఇన్నర్‌వీల్‌క్లబ్ సభ్యులు

డోన్: విద్యార్థుల్లోని ప్రతిభా వికాసాన్ని వెలికితీసి, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షుడు శకుంతలారెడ్డి, కార్యదర్శి విజయలక్ష్మి అన్నారు. తాజా డీఎస్సీలో ప్రతిభ కనబరిచి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఐదుగురు యువతీ యువకులను గురువారం స్థానిక సాయిశ్రీ జూనియర్ కళాశాలలో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ సప్తశైల సుమిత్ర రాజేష్, క్లబ్ సభ్యులు రాజేశ్వరి, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


మాట్లాడుతున్న సీడీపీఓ

ప్యాపిలి: చిన్నారులు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్ బేగం అన్నారు. మండల పరిధిలోని హుసేనాపురం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులు, బాలింతలను ఉద్దేశించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే బాలామృతం శిశువులకు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు దేవక్కమ్మ, శకుంతల, శోభారాణి, ఉమారాణి, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కరీంబాగ్‌లో డ్రైనేజీ సమస్య


డ్రైనేజీ కాలువలో పేరుకుపోయిన చెత్తచెదారం


బనగానపల్లె: పట్టణంలోని కరీంబాగ్‌లో డ్రైనేజీ కాలువ చెత్తతో నిండిపోవడంతో మురుగునీటి ప్రవాహం ఆగిపోయి దుర్వాసన వ్యాపిస్తున్నట్లు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను తొలగించడంలో పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా చర్యలు తీసుకుని డ్రైనేజీని శుభ్రం చేయాలని కోరుతున్నారు.

రైల్వేస్టేషన్‌లో మహిళ మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కొలిమిగుండ్ల: అనంతపురం జిల్లా తాడిపత్రి రైల్వేస్టేషన్‌లో కొలిమిగుండ్లకు చెందిన ఓ మహిళ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. నాయినపల్లెకు చెందిన శేషన్న కొలిమిగుండ్లలో ఉంటున్నాడు. భార్య లక్ష్మీదేవి(50) ఆరోగ్యం సరిగా లేకపోవడంతో తిరుపతిలోని ఆస్పత్రిలో వైద్యం చేయించుకునేందుకు రైలులో వెళ్లేందుకు తాడిపత్రి స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ ఉన్న సమయంలో ఆమె మృతి చెందింది. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

ఉమేష్ చంద్రకు నివాళి


నివాళులర్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

డోన్ టౌన్: ప్రతి పోలీసు, అధికారికి ఆదర్శప్రాయుడైన చదలవాడ ఉమేష్ చంద్ర ఐపీఎస్ అని డోన్ అగ్నిమాపక అధికారి రంగస్వామి గౌడ్, సామాజిక కార్యకర్త మహ్మద్ రఫీ అన్నారు. ఉమేష్ చంద్ర వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమాజంలో అసాంఘిక శక్తులపై ఆయన ప్రదర్శించిన ధైర్యాన్ని జీర్ణించుకోలేక ఉగ్రవాదులు కాల్పులు జరిపి ఆయనను హతమార్చారని పేర్కొన్నారు. ఆయన త్యాగం, సాహసం నేటికీ ప్రజల్లో చిరస్మరణీయమైందని తెలిపారు. లీడింగ్ ఫైర్‌మెన్‌లు ప్రభాకర్, రంగస్వామి, రాజు, రాజశేఖర్, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

ఖనిజాల తరలింపునకు బిల్లులు తప్పనిసరి

బేతంచెర్ల: బిల్లులు లేకుండా ఖనిజాలను తరలిస్తే కేసుల నమోదుతో పాటు జరిమానా విధిస్తామని భూగర్భ గనుల శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. బేతంచెర్ల నుంచి హైదరాబాద్‌కు బిల్లులు లేకుండా వెళ్తున్న పాలిష్ రాళ్ల లారీపై కేసు నమోదు చేసి రూ.42 వేల జరిమానా విధించారు. అలాగే రెండు రోజుల క్రితం పట్టుకున్న ఐరన్ ఓర్ లారీలపై రూ.2.50 లక్షల జరిమానా వేశారు.

ప్రమాదాలకు బ్రేకులు పడేనా?

- ప్యాపిలిలో స్పీడ్ బ్రేకర్లు లేక తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు
- నెల వ్యవధిలో ఇద్దరు మృతి, ముగ్గురికి గాయాలు


ప్రమాదానికి గురైన ద్విచక్రవాహనం (ఫైల్),


బాలుర ఉన్నత పాఠశాల వద్ద యూటర్న్

ప్యాపిలి: మండల కేంద్రంలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో రహదారులు ప్రమాదకరంగా మారాయి. నెల వ్యవధిలో రెండు ప్రమాదాలు జరిగి ఇద్దరు మృత్యువాత పడ్డారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. చిన్న చిన్న ప్రమాదాలు రోజువారీ వ్యవహారంగా మారి, ఒకరిద్దరు స్వల్ప గాయాల పాలవుతున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై వాహనాలు అదుపు లేకుండా దూసుకుపోతుండడంతో ప్రమాదాల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో రహదారి విస్తరణ

ప్యాపిలి పట్టణంలో బ్రిటీష్ కాలం నుంచి ఉన్న డబుల్ రోడ్డు విస్తరణను గత వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.16 కోట్లతో చేపట్టారు. మధ్యలో డివైడర్లు, యూటర్న్‌లు ఏర్పాటు చేసి పట్టణానికి కొత్త రూపురేఖలు ఇచ్చారు. ఈ పనులు పూర్తయిన వెంటనే ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం జరిగిపోయాయి. కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన నిర్మాణాలపై చిన్నచూపు చూసింది. కనీసం పెండింగ్‌లో ఉన్న పనులపై దృష్టి సారించలేకపోయింది. దీంతో రహదారి విస్తరణ అనంతరం రోడ్డుపై వేయాల్సిన స్పీడ్ బ్రేకర్ పనులకు బ్రేకులు పడ్డాయి.

ప్రమాదాలతో ఆందోళన

గత నెల 21న బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని యూటర్న్ వద్ద ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. ఈ నెల 24న తహసీల్దార్ కార్యాలయం ఎదుట బొలెరో ఢీకొట్టిన ఘటనలో మరో యువకుడు మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయపడ్డారు. ఇది కాకుండా ప్రతిరోజూ చిన్నపాటి ప్రమాదాలు కొనసాగుతూనే ఉండటం స్థానికులను భయాందోళనలకు గురిచేస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి జగనన్న కాలనీ, పెద్ద పొదిళ్ల రోడ్డు, కలచట్ల రోడ్డు, బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. పట్టణంలోని విద్యార్థుల రక్షణ దృష్ట్యా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లు లేకనే ప్రమాదాలు



వయోవృద్ధులు, దివ్యాంగులు రోడ్డు దాటే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ఆర్టీసీ బస్సులు పట్టణంలో అతివేగంతో వెళ్తున్నాయి. ద్విచక్రవాహన చోదకులు సైతం అత్యంత వేగంతో వెళ్తున్నారు. స్పీడ్ బ్రేకర్లు ఉంటే వాహనాల వేగాన్ని నియంత్రించవచ్చు. తద్వారా ప్రమాదాలు జరుగకుండా అరికట్టవచ్చు. అధికారులు స్పందించి పట్టణంలో అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. –శ్యాంసన్, సీనియర్ సిటిజన్స్ నాయకుడు, ప్యాపిలి

సూచికలు ఏర్పాటు చేయాలి



పట్టణంలోని కలచట్ల రోడ్డు, పెద్దపొదిళ్ల రోడ్డు, జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల వద్ద ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. అతివేగంతో వస్తున్న వాహనాల కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాలల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ముఖ్యమైన యూటర్న్‌ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. లేకపోతే భవిష్యత్తులో మరిన్ని రోడ్డు ప్రమాదాలు జరుగుతాయి. –చైతన్య, ప్యాపిలి

నేడు గాయత్రి పీఠంలో గురుపూజోత్సవం

డోన్ టౌన్: మాజీ రాష్ట్రపతి, భారతరత్న గ్రహీత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం 5 గంటలకు పట్టణ సమీపంలోని శ్రీగాయత్రి పీఠంలో గురుపూజోత్సవం నిర్వహించనున్నట్లు వేదబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శంకరశర్మ, ఉపాధ్యక్షుడు క్లో శేషావలిశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి శతవధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అదేవిధంగా డివిజన్, మండలస్థాయి అధికారులు కూడా పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రెండు రోజుల్లో సంజామలకు యూరియా

సంజామల: యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి భూమ జ్యోతి తెలిపారు. మరో రెండు రోజుల్లో జిల్లా కేంద్రానికి 5,200 టన్నుల యూరియా రానున్నదని, అందులో 140 టన్నులు సంజామల మండలానికి కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. యూరియా అందిన వెంటనే తహసీల్దార్, ఎస్‌ఐ, వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు. పంటలు వేసిన ప్రతి ఒక్కరికి రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

క్షణిక నిర్ణయాలు భవిష్యత్తును పాడుచేస్తాయి


విద్యార్థులతో మాట్లాడుతున్న సైకాలజిస్టు జ్యోతిర్మయి

బేతంచెర్ల: క్షణికమైన నిర్ణయాలతో భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సైకాలజిస్టు డాక్టర్ జ్యోతిర్మయి సూచించారు. గురువారం మండల పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఏపీ యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, ఉద్యోగ మార్గదర్శకతపై అవగాహన కార్యక్రమం జరిగింది. విద్యార్థులు ఎదుగుతున్న వయస్సులో ఎదురయ్యే శారీరక, మానసిక మార్పులను ధైర్యంగా ఎదుర్కొంటూ ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆమె పిలుపునిచ్చారు. జ్ఞాపకశక్తిని మెరుగు పరచుకోవడం ద్వారా పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకుని మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, రీల్స్, యూట్యూబ్, ట్విట్టర్ వంటివాటికి బానిసలై జీవితాలను పాడు చేసుకోవద్దని హెచ్చరించారు. ఈ వ్యసనాల వల్ల చిన్న వయసులోనే క్రైమ్ ప్రవర్తన పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటికి దూరంగా ఉంటే బంగారు భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియదాసు, ఉపాధ్యాయులు స్వర్ణలత, వెంకటలక్ష్మి, మహేష్ పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక


గుండా హరిప్రసాద్, శివనాగేశ్వరరావు, పూజారి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటన్న, వేదవతి

బనగానపల్లె రూరల్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను గురువారం ప్రకటించారు. వీరిలో బనగానపల్లె కొండపేట ఎంపీపీ పాఠశాల నుంచి గుండా హరిప్రసాద్, బనగానపల్లె జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నుంచి భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు సి. శివనాగేశ్వరావు, నందవరం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి తెలుగు ఉపాధ్యాయుడు పూజారి శ్రీనివాసులు ఎంపికయ్యారు. వీరిని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు సతీష్, ప్రసాద్, ఎం. శ్రీనివాసులు అభినందించారు. శుక్రవారం నంద్యాలలో జరిగే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టర్, డీఈఓ చేతుల మీదుగా అవార్డు అందుకుంటారు. ఎంపికైన ఉపాధ్యాయులకు పలువురు అభినందనలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

బేతంచెర్ల: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా బేతంచెర్ల మండలం నుంచి నలుగురు ఎంపికయ్యారు. వీరిలో వెంకటేశ్వర్లు- ఏపీ మోడల్ స్కూల్, వెంకటన్న-బుగ్గానిపల్లె జెడ్పీ హైస్కూల్, అంబటి వేదవతి-కొలుములపల్లె జెడ్పీ హైస్కూల్, ఆర్. వెంకటరమణ- బేతంచెర్ల మెయిన్ ప్రాథమిక పాఠశాల ఉన్నారు. వీరంతా శుక్రవారం నంద్యాలలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోనున్నారు. వీరు ఎంపికపై ఎంఈఓ సోమశేఖర్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

పాఠశాలకు బీరువా వితరణ


బీరువాను అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నేతలు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోర్లగుట్ట జెడ్పీ హైస్కూల్‌కు మండల ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు దాత గుండా గోపాలు సహకారంతో గురువారం బీరువాను అందజేశారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కందగడ్డల జనార్దన్, సుధీర్, రాజేంద్ర పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ సర్వర్

- గంటన్నరపాటు ఆగిన బస్సులు
- ప్రయాణికుల అవస్థలు


కోవెలకుంట్ల బస్టాండ్‌లో నిలిచిపోయిన బస్సులు,


బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

కోవెలకుంట్ల: ఆర్టీసీ సర్వర్ మొరాయించడంతో గురువారం టిమ్స్ పనిచేయక ఏకంగా గంటన్నరపాటు ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక డిపో నుంచి ప్రతి రోజు ఉదయం 5 గంటలకు బస్సు సర్వీసులు ప్రారంభమై నంద్యాల, కర్నూలు, జమ్మలమడుగు, ఆళ్లగడ్డ, తాడిపత్రి, తదితర పట్టణాలకు రాకపోకలు సాగుతున్నాయి. ఆయా రూట్లకు తెల్లవారుజామునే కొన్ని బస్సులు బయలుదేరి వెళ్లిపోయాయి. ఉదయం 6 గంటల నుంచి కండక్టర్లకు కేటాయించిన టిమ్స్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో మిగిలిన బస్సుల రాకపోకలు స్తంభించిపోయాయి. ఉదయం 7.30 గంటల వరకు టికెట్ మిషన్లు పనిచేయకపోవడంతో బస్సులు ప్లాట్‌ఫాంకే పరిమితమయ్యాయి. ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, మహిళలు, ఇతరులు పనుల నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు బస్టాండ్ చేరుకున్నారు. ఆయా రూట్లకు వెళ్లే బస్సులు ప్లాట్‌ఫామ్స్ వద్దనే నిలిచిపోవడంతో ప్రయాణికులు బస్టాండ్‌లో వేచి ఉండాల్సి వచ్చింది. గంటన్నర తర్వాత టిమ్స్ పనిచేయగా బస్సుల రాకపోకలు కొనసాగడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

గోరుకల్లు పైప్‌లైన్ పగిలి నీరు వృథా

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామ సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్ ముందు భాగంలో గురువారం ఉదయం గోరుకల్లు రిజర్వాయర్ పైప్‌లైన్ పగిలింది. దీంతో నీరు ఎగసిపడుతూ వృథాగా పోతోంది. ఈ దృశ్యాన్ని రహదారి వెంట వెళ్తున్న వారు గమనించి తాగునీటి సరఫరా అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అధికారులు నీటి సరఫరాను నిలిపివేయడంతో అధిక మొత్తంలో తాగునీరు వృథా కాకుండా అరికట్టారు.


పైప్‌లైన్ నుంచి ఎగసిపడుతున్న నీరు

సమాజ నిర్మాణంలో గురువుపాత్ర కీలకం




పాతపేట హైస్కూల్ హెచ్‌ఎంను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సభ్యులు, ప్యాపిలి: సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్: సమాజంలో గురువు స్థానం అత్యున్నతమైందని, వారి మార్గదర్శకత్వంలోనే సమ సమాజ స్థాపన సాధ్యమవుతుందని ఎస్‌ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు తెలుగు విజయ్‌కుమార్ అన్నారు. ముందస్తు గురు పూజోత్సవం భాగంగా పాతపేట జెడ్పీ హైస్కూల్, గర్ల్స్ హైస్కూల్ హెచ్‌ఎంలు పద్మావతమ్మ, మైమున్నీసాబేగంలను శాలువలు కప్పి, మెమెంటోలు అందించి సత్కరించారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌యూఐ నాయకులు మాబె, దాదా, మధు, రఫీ, అజయ్, నవీన్ పాల్గొన్నారు.

సమాజ మార్గదర్శకుడు.. ఉపాధ్యాయుడు

డోన్: పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల్లో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు మాధవి, పవన్‌కుమార్‌లను ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ తరుపున సత్కరించారు. ముఖ్య అతిథిగా రూరల్ ఎస్‌ఐ మమత, సంస్థ గౌరవాధ్యక్షుడు నాగభూషణంరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి రామ్మోహన్, సహాయ కార్యదర్శి కొత్తపల్లె బాషా, కోశాధికారి గుండాల జగన్ పాల్గొన్నారు.

- **ప్యాపిలి:** స్థానిక బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఎస్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంఈఓలు మహేశ్వర్ రెడ్డి, వెంకటేశ్‌నాయక్ పాల్గొన్నారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన హరినాథ్ రెడ్డి, డీఎస్సీలో ఎంపికైన విజయ్ కుమార్ రెడ్డి, పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. ఎస్టీయూ స్టేట్ కౌన్సిలర్ వెంకటేశ్ నాయక్, యూనియన్ నాయకులు చంద్రమౌళి, చిన్నపరెడ్డి, హాజీ మస్తాన్ వలి, చంద్రమౌళి పాల్గొన్నారు.

బస్సును ఢీకొని స్కూటరిస్టుకు గాయాలు


బస్సును ఢీకొట్టిన బైక్

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం వద్ద గురువారం ఉదయం ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొంది. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. బనగానపల్లె మండలం చెర్లోకొత్తూరు గ్రామానికి చెందిన శేఖర్ రెడ్డి బనగానపల్లె నుంచి తన స్వగ్రామానికి తిరిగి వస్తుండగా, కేవీకే వద్ద ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆదర్శనీయుడు సర్వేపల్లి


కోవెలకుంట్ల: సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సర్వేపల్లి రాధాకృష్ణన్ అడుగుజాడల్లో నడవాలని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అన్నారు. సర్వేపల్లి జయంతి సందర్భంగా గురువారం కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఏ శాస్త్రాన్ని, విషయాన్ని అవగాహన చేసుకోవాలన్నా ఉపాధ్యాయుని పాత్ర అనివార్యం అన్నారు. కృత్రిమ మేధ ఎప్పటికీ ఉపాధ్యాయునికి ప్రత్యామ్నాయం కాదని అభిప్రాయపడ్డారు. అనంతరం విద్యార్థులు అధ్యాపకులను సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రెడ్డి, అధ్యాపకులు కృష్ణదాసు, రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరేంద్రనాథరెడ్డి, లక్ష్మిదేవి, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

ఏఐ ఎక్స్‌రేతో ఉత్తమ ఫలితాలు

బనగానపల్లె రూరల్: ఊపిరితిత్తుల వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ సోహైల్‌బాబు అన్నారు. మండలంలోని యాగంటిపల్లె ఆరోగ్య ఉపకేంద్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఎక్స్ రే ఆధారిత ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఏఐ ఎక్స్ రే ద్వారా ఊపిరితిత్తుల్లో ఏవైనా సమస్యలు తేలికగా గుర్తించవచ్చని తెలిపారు. క్షయ వ్యాధి, ఆయాసం, సీఓడీటీ వంటి వ్యాధులను ముందే గుర్తించి, తగిన చికిత్స ప్రారంభించవచ్చని పేర్కొన్నారు. శిబిరంలో 50 మందికి ఏఐ ఎక్స్ రే పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు.

బేతంచెర్లలో మిలాద్-ఉన్-నబీ ర్యాలీ


ర్యాలీగా వెళ్తున్న మండల ఖాజీ, ముస్లింలు

బేతంచెర్ల: మిలాద్-ఉన్-నబీ పండుగను పురస్కరించుకుని గురువారం పట్టణంలో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. స్థానిక జెండాపేట మసీదు నుంచి మెయిన్ బజార్, ప్రధాన రహదారి మీదుగా మండల ఖాజీ నూర్ అహ్మద్ ఆధ్వర్యంలో ర్యాలీ సాగింది. అల్లా కరుణతో అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అసూయకు దూరంగా ఉంటూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని పిలుపునిచ్చారు. పాత బస్టాండ్ నుంచి ఖాజీ నూర్ అహ్మద్‌ను గుర్రంపై ఊరేగింపు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ముస్లింలు ముర్తుజావలి, ఖాజా హుసేన్, సద్దామ్, ఖాజా, మగ్బుల్, మహబూబ్, రహంతుల్లా, అక్తాబ్ పాల్గొన్నారు.

వెలగని సెంట్రల్ లైటింగ్


అంధకారంలో ప్రధాన రహదారి

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్ల ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వెలగకపోవడంతో అంధకారం ఏర్పడింది. నాలుగు రోజుల నుంచి లైటింగ్ లేకపోవడంతో స్థానికులతో పాటు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రామ్‌కో సిమెంట్ కంపెనీ రెండేళ్ల క్రితం సీఎస్ఆర్ నిధులతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయించింది. రెండు,మూడు నెలల నుంచి తరచూ ఆటంకాలు ఏర్పడుతున్నాయి. టైమింగ్ అమర్చడంతో ఆటోమేటిక్‌గా ఆన్‌ఆఫ్ అవుతుంటాయి. ఎక్కడ సమస్య ఉందో కాని సరిగ్గా పని చేయడం లేదు. ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు పక్కనే ఉండడంతో రాత్రిళ్లు లైటింగ్ లేక ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. సెంట్రల్ లైటింగ్ నిర్వహణ బాధ్యత ఎవరూ చూస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. రెండు,మూడు చోట్ల లైట్లు వెలగక సుమారు ఐదు నెలలు అవుతోంది. అధికారులు స్పందించి సెంట్రల్ లైటింగ్ వెలిగేలా చూడాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.